శుక్రవారం
6మార్చి 2026
సంపుటి: 02 సంచిక:348
పేజీలు : 04, వెల రూ. 2రూ/
ఎడిటర్ : మజ్జి శివ కుమార్..

Published by:Vizianagaram, Visakhapatnam, Srikakulam, Parvathipuram manyam, Anakapalli, Kurnool, Alluri, Guntur, Vijayawada, East & West Godavari, Tirupathi, Hyderabad

www.prajaswamyamtelugudaily.com

స్థాపితం : 2008

# ప్రజాస్వామ్యం
తెలుగు దినపత్రిక

PRAJASWAMYAM TELUGU DAILY (ANDHRA & TELANGANA)

RNI No. APTEL/2008/24928Postal Registration No.: VZM/22/2020-2022 Period of Renewal


## భారత్‌కు రష్యా బాసట!

కొన్ని వారాల్లోనే భారత్‌కు రష్యా చమురు నౌకలు



2లో



## అమెరికా 'డూమ్స్‌డే' సక్సెస్

### క్షిపణికి వార్‌హెడ్‌లను మోసుకెళ్లగల సామర్థ్యం

వాషింగ్టన్, మార్చి 5: పశ్చిమాసియాలో యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో అమెరికా భారీ అణు సామర్థ్యం గల క్షిపణి పరీక్ష నిర్వహించడం ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. అమెరికా సైన్యం కాలిఫోర్నియా తీరం లో ఉన్న వాండెన్‌బర్గ్ స్పేస్ ఫోర్స్ బేస్ నుం చి శక్తిమంతమైన మినిట్‌మ్యాన్3 డూమ్స్ డే బాలిస్టిక్ క్షిపణిని విజయవంతంగా ప్ర యోగించింది. ఈ పరీక్షను అమె రికా సాధారణ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిం దని అధికారులు వెల్లడించారు. ఈ క్షిపణి పరీక్ష సాంటా బార్బరా సమీపంలోని వాండెన్‌బర్గ్ స్పేస్ ఫోర్స్ బేస్ నుంచి నిర్వహిం చారు. జీటీ-254 పేరుతో నిర్వహించిన ఈ పరీక్షలో నిరాయుధ రాకెట్‌ను ఉపయోగించినట్లు అమెరికా అధికారులు తెలిపారు. ప్రయోగించిన

వివరాలు2లో..

### ఖమేనీ మృతికి భారత్
## అధికారికంగా సంతాపం



న్యూఢిల్లీ, మార్చి 5 : ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మృతికి భారతదేశం సంతాపం ప్రకటించింది. ఇరా న్ అధినేత ఖమేనీ అమెరికా, ఇజ్రాయెల్ దాడిలో ఇటీవల మృతిచెందిన విషయం తెలిసిందే. ఇవాళ దేశ రాజధాని న్యూఢిల్లీలో ని ఇరాన్ రాయబార కార్యాలయంలో విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ అధికారికం గా సంతాప సందేశం రాశారు.భారత ప్రభు త్వం తరఫున విదేశాంగ కార్యదర్శి ఇరాన్ రాయబార కార్యాలయానికి వెళ్లారు. సంతా ప సందేశాన్ని రాసిన అనంతరం మిస్రీ ఇరాన్ రాయబారితో కాసేపు మాట్లాడారు. ప్రస్తుతం పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులపై వారు చర్చించినట్లు తెలుస్తోంది.



### పశ్చిమాసియాలో..
## ధ్వంసకాండ

**1230 కి చేరిన ఇరాన్ మృతుల సంఖ్య, వేలల్లో క్షతగాత్రులు**
**వారసుడి ఎంపిక జరగలేదని ప్రకటించిన ఇరాన్**
**భారత్‌కు సరఫరా అయ్యే ఎల్ఎన్‌జి 30 శాతం కోత**
**మధ్యవర్తిత్వం వహిస్తాం : చైనా**

టెహ్రాన్ : పశ్చిమాసియాలో భారీ దాడులతో యుద్ధం ఆరో రోజూ కొనసాగింది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ యద్ధోన్మాద దాడులు విస్తృతమయ్యాయి. ఇజ్రాయిల్ దళాలు టెహ్రాన్‌లోని జనావాసాలపై గురువారం వైమానిక దాడులు నిర్వహించాయి. ఈ దాడుల్లో ఇరాన్ కమాండ్ సెంటర్లు, మిసైల్ వ్యవస్థలు లక్ష్యంగా చేసుకున్నాయి. ఇరాన్ అంతటా అమెరికా, ఇజ్రాయిల్ దళాల బాంబు దాడులు కొనసాగుతున్నాయి, ముఖ్యంగా సనందాజ్, టెహ్రాన్ ప్రాంతాల్లో భారీ పేలుళ్లు సంభవించాయి. దీనికి ప్రతిగా, ఇరాన్ కూడా ఇజ్రాయిల్‌లోని టెల్ అవీవ్, మెరాన్ రాడార్ బేస్‌తో సహా పలు లక్ష్యాలపై డ్రోన్ దాడులు నిర్వహించినట్లు ఇరాన్ సైన్యం ప్రకటించింది. ఈ యుద్ధంతో భారీ ప్రాణనష్టంతో పాటు, ప్రపంచవ్యాప్తంగా ఇంధన సరఫరాపై తీవ్ర ప్రభావం పడుతోందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇరాన్ ప్రభుత్వ గణాంకాల ప్రకారం, ఇప్పటివరకు ఈ యుద్ధంలో 1,230 మంది మరణించారు. అమె రికా, ఇజ్రాయిల్ దళాలు ఉద్దేశపూర్వకంగా పౌర ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుంటున్నా యని ఇరాన్ విదేశాంగ శాఖ గురువారం తెలిపింది.వారసుడి ఎంపిక జరగలేదు : ఇరాన్‌ప్రస్తుతం, దేశ బాధ్యతలను తాత్కాలికంగా ముగ్గురు సభ్యుల కౌన్సిల్ పర్యవేక్షి స్తోంది. ఈ కౌన్సిల్‌లో ఇరాన్ అధ్యక్షుడు, చీఫ్ ఆఫ్ జుడిషియరీ, గార్డి యన్ కౌన్సిల్ సభ్యుడు

వివరాలు2లో..

## డిజిటలైజేషన్, సుస్థిరాభివృద్ధిలో ద్వైపాక్షిక బంధం

### ప్రధాని మోడీతో ఫిన్లాండ్ అధ్యక్షులు అలెగ్జాండర్ భేటీ



న్యూఢిల్లీ : భారత్, ఫిన్లాండ్ తమ ద్వైపాక్షిక సంబంధాలను మలిదశకు తీసుకెళ్లాలని నిర్ణయిం చాయి. భారత్ పర్యటనలో ఉన్న ఫిన్లాండ్ అధ్యక్షులు అలెగ్జాండర్ స్టబ్ గురువారం నాడు ఇక్కడి హైదరాబాద్ హౌస్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో సమావేశం అయ్యారు. అనంతరం ఇరువురు సంయుక్త మీడియా సమావేశంలో మాట్లాడారు. డిజిటలైజేషన్, సుస్థిరా భివృద్ధి రంగాల్లో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేయనున్నట్లు ఇరువరు నేతలు ప్రకటించారు. ప్రధానంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, 6జి టెలికాం, క్లీన్ ఎనర్జీ, క్వాంటమ్ కంప్యూటింగ్

వివరాలు2లో..

## బీహార్ రాజకీయాల్లో సంచలనం..

### సీఎం నితీష్ కుమార్ రాజీనామా



## జనాభాతోనే భాగ్యం

### నిర్వహణకు పంచ సూత్రాలు
### కొత్త పాలసీపై నెలాఖరు వరకూ అభిప్రాయ సేకరణ
### శాసనసభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు



అమరావతి బ్యూరో : మారుతున్న కాలానికి అనుగుణంగా జనాభా పెరుగుదల భారం కాదని, రాష్ట్రానికి భాగ్యం అవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. శాసనసభలో గురువారం ఆయన జనాభా నిర్వహణపై డ్రాఫ్ట్ పాలసీని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటి వరకూ జనాభా నియంత్రణకు ప్రాధాన్యత ఇచ్చామని, ఇప్పుడు ఆ పరిస్థితి మారుతోందని అన్నారు. రాష్ట్రంలో పెర్టిలిటీ రేటు ప్రస్తుతం 1.5 శాతంగా ఉందని, ఇదే పద్దతిలో వెళితే మరింత తగ్గే ప్రమాదం ఉందని చెప్పారు. జనాభాను సక్రమంగా నిర్వహించేందుకు మాతృత్వం, శక్తి, నైపుణ్యం, క్షేమం, సంజీవని అనే పంచ సూత్రాలను అమలు చేయనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో గ్రోత్ రేట్ తక్కువగా ఉందని, 2.1 శాతం కంటే తక్కువ ఉంటే జనాభా తగ్గుతుందని తెలిపారు. 2023 లెక్కల ప్రకారం రాష్ట్రంలో కేవలం ఏడాదికి 6.70 లక్షల జననాలు మాత్రమే ఉన్నాయని, ఇది కొనసాగితే 2047 నాటికి 23 శాతం మంది వృద్ధులే ఉంటారని చెప్పారు. పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీపై ప్రతి నియోజకవర్గంలో నెలరోజులపాటు ప్రజాప్రతినిధులు చర్చించాలని పేర్కొన్నారమహిళా వర్కుఫోర్స్ పెరిగితేనే జీఎస్‌డిపి వృద్ధిమహిళా వర్కుఫోర్స్ ప్రస్తుతం 31 శాతం మాత్రమే ఉందని, ఇది 59 శాతానికి చేరుకుంటే రాష్ట్ర జిడిపి 15 శాతం పెరుగుతుందని అన్నారు. గర్భధారణ నుండి వృద్ధాప్యం వరకు ప్రతిదశలోనూ ప్రభుత్వ మద్దతు మహిళలకు ఉంటుందని తెలిపారు. మాతృత్వ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఏర్పాటు చేసి ప్రభుత్వాస్పత్రుల్లో ఐవిఎఫ్ సేవలు పిపిపి విధానంలో అందిస్తామని

### దంతెవాడ-బీజాపూర్
## సరిహద్దులో ఎన్‌కౌంటర్



దంతెవాడ: ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ-బీజాపూర్ సరిహదు వెంబడి దట్టమైన అటవీ-పర్వత ప్రాంతంలో మావోయిస్టులతో జరిగిన భీకర ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న భద్రతా దళాలు ఒక సాయుధ తిరుగుబాటుదారుడిని మట్టుబెట్టాయని పోలీసు అధికారులు గురువారం తెలిపారు. మావోయిస్టును భైరామ్‌గఢ్ గ్రూపులోని ఏరియా కమిటీ సభ్యుడు రాజేష్ పూనెంగా గుర్తించారు. అతని తలపై ఐదు

## హోర్ముజ్‌లో ఉద్రిక్తత!

### సముద్ర మార్గంలో నిలిచిపోయిన వందలాది నౌకలు
### - వివిధ నౌకల్లో చిక్కుకున్న 23 వేల మంది భారత సిబ్బంది

హర్మూజ్, ఫిబ్రవరి 4: యుద్ధం నేపథ్యంలో హోర్ముజ్ జలసంధి మార్గంలో చమురు రవాణా నౌకలను నిలిపివేస్తున్నట్లు ఇటీవల ఇరాన్ ప్రకటించింది. ఎవరైనా ముందుకు వస్తే దాడి చేస్తామని హెచ్చరించింది. దీంతో ఈ మార్గంలో చమురు రవా ణా నౌకలు పూర్తిగా నిలిచిపోయాయి. హో ర్ముజ్ వద్ద నౌకల ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. అయితే చమురు నౌకలకు అమెరికా హామీ ఇచ్చింది. నౌకలకు ఎస్కార్ట్ కల్పిస్తామని తెలిపింది.ఉద్యోగ అవకాశాలఇంతలో తమ జలసంధిపై అమెరికా పెత్తనమేంటని ఇరాన్ స్పందించింది. భారత్ చైనా తోపాటు మరికొన్ని దేశాల నౌకలను అనుమతిస్తామని, యూఎస్, యూరప్, ఇజ్రాయెల్ నౌకలకు ఎంట్రీ లేదని స్పష్టం చేసింది. హోర్ముజ్ నుంచి అన్ని దేశాలకు చమురు సరఫరా నిలిపివేయట్లేదని ఇరాన్ ప్రకటించింది.



## ఫైనల్‌కు టీమిండియా

### భయపెట్టిన బేథెల్
### భారీ ఛేదనలో పోరాడి ఓడిన ఇంగ్లండ్




ముంబయి: ఐసిసి టి20 ప్రపంచకప్ ఫైనల్‌కు టీమిండియా వరుసగా రెండోసారి ప్రవేశించింది. వెస్టిండీస్, అమెరికా వేదికగా 2024లో జరిగిన టి20 ప్రపంచకప్ ఫైనల్‌కు చేరి టైటిల్‌ను కొట్టిన భారతజట్టు ముచ్చటగా మూడోసారి టైటిల్‌కు అడుగు దూరంలో నిలిచింది. టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన భారతజట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 253పరుగుల భారీస్కోర్ నమోదు

వివరాలు2లో..

# భారత్‌కు రష్యా బాసట!

ఢిల్లీ, మార్చి 5 : ఆపత్కాలంలో భారత్‌కు మిత్రదేశం రష్యా బాసటగా నిలిచింది. పశ్చిమాసియాలో యుద్ధం కొనసాగుతున్న వేళ చమురు నిల్వలు భారత్‌ను ఆందోళనకు గురి చేస్తున్నాయి. మరో వైపు చమురు సరఫరాకు అంతరాయం ఏర్పడుతున్న ఇలాంటి తరుణంలో రష్యా మరోసారి భారత్‌కు అండగా నిలిచింది.భారత్‌కు ముడి చమురును మళ్లించడానికి రష్యా సిద్ధంగా ఉంది. ఏకంగా 95 లక్షల బ్యారెళ్ల చమురు కొన్ని వారాల్లోనే భారత్‌కు తరలించేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలిసింది.ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా దాడులు చేస్తున్న నేపథ్యంలో హోర్మోజ్ జలసంధి నుంచి చమురు రవాణా నిలిచిపోయింది భారత్ దిగుమతి చేసుకుంటున్న ముడి చమురు లో దాదాపు 40శాతం హోర్మోజ్ ద్వారా జరుగుతోంది. భారత్ వద్ద ప్రస్తుతం కేవలం 25 రోజులకు సరిపడా ముడి చమురు నిల్వలు మాత్రమే ఉన్నాయి. ఈ నేపథ్యంలో భారత్‌కు ముడి చమురును మళ్లించడానికి రష్యా సిద్ధమైనట్టు తెలిసింది. భారతీయ సముద్ర జలా లకు సమీపంలోనే ఉన్న నౌకలలోని దాదాపు 95 లక్షల బ్యారెళ్ల చమురు కొన్ని వారాల్లోనే భారత్ చేరుకోగలదని పరిశ్రమ వర్గాలు రాయిటర్స్ వార్తాసంస్థకు తెలిపాయి. కొన్ని వారాల్లోనే ఈ చమురు నౌకలు భారత్ చేరుకుంటాయని మాత్రం వారు వెల్లడించారు.

# అమెరికా 'డూమ్స్‌డే' సక్సెస్

మొదటి పేజీ తరువాయి

క్షిపణి పసిఫిక్ మహాసముద్రంలో ఉన్న మార్షల్ ఐస్ ల్యాండ్ సమీ పంలోని లక్ష్యాన్ని కచ్చితంగా తాకినట్లు అమెరికా స్పేస్ ఫోర్స్ వెల్లడించిందిఅణు వార్‌హెడ్‌లను మోసుకెళ్లే సామర్థ్యం మినిట్‌మ్యాన్ డూమ్స్‌డే క్షిపణి అమెరికా రక్షణ వ్యవస్థలో కీలక భాగమని అధికారులు తెలిపారు. ఈ క్షిపణి అణు వార్ హెడ్‌లను మోసుకెళ్ల గల సామర్థ్యం కలిగి ఉంటుంది. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో హిరోషిమాపై పడేసిన అణుబాం బుల కంటే 20 రెట్లు శక్తివంతమైన వార్‌హెడ్‌లను మోయగల క్షిపణి అని అధికారులు చెబుతున్నారు. ఈ పరీక్ష పూర్తిగా రక్షణాత్మక ప్రయోజనాల కోసం నిర్వహించిందని అధికారులు పేర్కొన్నారురక్షిపణి వ్యవస్థ కచ్చితత్వం, ప్రభావం, సిద్ధంగా ఉండే చర్యలను పరీక్షించడం ప్రధాన లక్ష్యమని అధికా రులు వివరించారు. అలాగే వివిధ మిషన్ ప్రొఫైల్స్ ద్వారా మినిట్‌మ్యాన్ డూమ్స్ డే వ్యవస్థ పనితీరును మెరుగుపరచడానికి ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అమెరికా భూమి ఆధారిత అణు దాడి వ్యవస్థ సిద్ధతను నిర్ధారించుకోవడమే ఈ పరీక్ష ముఖ్య ఉద్దేశమని అధికారులు పేర్కొన్నారు. అంతర్జాతీయ భద్రతా పరిస్థితులు మారుతున్న నేపథ్యంలో రక్షణ వ్యవస్థలు ఎప్పుడూ సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

# పశ్చిమాసియాలో..ధ్వంసకాండ



మొదటి పేజీ తరువాయి

ఉన్నారు. ఖమేనీ వారసుడిని ఎన్నుకునే ప్రక్రియ ఇంకా కొనసాగుతోందని, ఖమేనీ కుమారుడు మోజ్తబా ఖమేనీ ఎంపికయ్యారన్న వార్తలు అవాస్తవమని భారత్‌లోని ఇరాన్ ప్రతినిధి అయతొల్లా అబ్దుల్ మజీద్ హకీమెలాహి స్పష్టం చేశారుఎల్ఎన్‌జికి కోత.హోర్ముజ్ జలసంధిలో ఉద్రిక్తతల వల్ల భారత్‌కు వచ్చే ద్రవరూప సహజ వాయువు (ఎల్‌పిజి) సరఫరాలో 30 శాతం కోత పడింది. దీని వల్ల గెయిల్ (జిఎఐఎల్) సంస్థ తన వినియోగదారులకు గ్యాస్ సరఫరాను తగ్గించాల్సి వస్తోంది. రష్యా రాయబారి డెనిస్ అలిపోవ్ గురువారం మీడియాతో మాట్లాడుతూ, ఈ సంక్షోభ సమయంలో భారత్‌కు ముడి చమురు సరఫరా చేసేందుకు రష్యా ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని మరోసారి పునరుద్ఘాటించారు.సముద్ర మార్గాల్లో చిక్కుకున్న వేలాది మందియుద్ధం కారణంగా గల్ఫ్ ప్రాంతంలో పలు దేశాలకు చెందిన సుమారు 20వేల మంది నావికులు, 15వేల మంది క్రూయిజ్ ప్రయాణికులు చిక్కుకు పోయారని అంతర్జాతీయ నౌకాయాన సంస్థ (ఐఎంఒ) వెల్లడించింది. మరోవైపు అమెరికా జలాంతర్గామి దాడిలో ధ్వంసమైన ఇరాన్ యుద్ధనౌక 'ఐఆర్ఐఎస్ దేనా' ఘటన తర్వాత, మరో ఇరాన్ యుద్ధనౌక శ్రీలంక జలాల వైపు వస్తోంది. ఇది ఆ ప్రాంతంలో మరింత ఆందోళన కలిగిస్తోంది.లొంగిపోండి లేదంటే మరణం తప్పదు : ట్రంప్అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్ దళాలను లొంగిపోవాలని, లేదంటే మరణం తప్పదని హెచ్చరించారు. కెనడా ప్రధాని మార్క్ కార్నీ కూడా ఈ యుద్ధంలో తమ సైన్యం పాల్గొనే అవకాశాన్ని కొట్టిపారేయలేమని చెప్పారుఇరాన్‌లో ఇంటర్నెట్ నిలిపివేతగత 120 గంటలుగా ఇరాన్‌లో ఇంటర్నెట్ సేవలు దాదాపు పూర్తిగా నిలిచిపోయాయి. సాధారణ స్థాయి కంటే కేవలం 1 శాతం మాత్రమే కనెక్టివిటీ ఉందని నెట్‌బ్లాక్స్ సంస్థ తెలిపింది. మరోవైపు భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రి ఢిల్లీలోని ఇరాన్ రాయబార కార్యాలయాన్ని సందర్శించి, ఖమేనీ మరణం పట్ల భారత ప్రభుత్వం తరపున సంతాపం వ్యక్తం చేయడం గమనార్హం మధ్యవర్తిత్వానికి సిద్ధం : చైనామధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలను చల్లార్చడానికి చైనా ప్రయత్నాలు చేస్తోంది. ఈ మేరకు అవసరమైతే రెండు పక్షాల మధ్య మధ్యవర్తిత్వం వహిస్తామని ప్రకటించింది. దీనిపై ఇప్పటికే చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యి.. గల్ఫ్ దేశాధినేతలతో ఫోన్‌లో చర్చలు జరిపారని చైనా విదేశాంగ ప్రతినిధి లిన్ జియాన్ వెల్లడించారు. యుఎఇ ఉప ప్రధాని అబ్దుల్లా బిన్ జాయెద్ అల్ సహ్యాన్ సహా పలువురు నేతలతో మాట్లాడినట్టు తెలిపారు. అలాగే రష్యా, ఒమన్, ఫ్రాన్స్, ఇరాన్, ఇజ్రాయిల్‌తో కూడా చర్చించామని తెలిపారు.

# డిజిటలైజేషన్, సుస్థిరాభివృద్ధిలో ద్వైపాక్షిక బంధం

మొదటి పేజీ తరువాయి

వంటి అత్యాధునిక రంగాల్లో కలిసి పనిచేయనున్నట్టు తెలిపారు. ఆ భాగస్వామ్యం రెండు దేశాల మధ్య సాంకేతిక, ఆర్థిక సహకారానికి కొత్త ఉత్సాహాన్ని ఇస్తుందని పేర్కొన్నారు.

చర్చలు, రాజనీతితోనే పరిష్కారం : మోడీ

ప్రస్తుతం ప్రపంచం అస్థిరత, అనిశ్చితి దశలో ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆందోళన వ్యక్తం చేశారు. ఉక్రెయిన్ నుంచి పశ్చిమాసియా వరకు అనేక ప్రాంతాల్లో ఘర్షణలు కొనసాగుతున్నాయని, చట్టపరమైన వ్యవస్థ, సంభాషణ, రాజనీతి మార్గాలే శాశ్వత పరిష్కారాలు చూపగలవని భారత్, ఫిన్లాండ్ విశ్వసిస్తున్నాయని మోడీ అన్నారు. ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న యుద్ధాలు, భద్రతా ఉద్రిక్తతల నేపథ్యంలో శాంతి, సంభాషణల ద్వారానే సమస్యలకు పరిష్కారం సాధ్యమని ఆయన పేర్కొన్నారు. భద్రతామండలిలో భారత్ స్థానం అత్యవసరం : స్టబ్‌ఫిన్లాండ్ అధ్యక్షులు అలెగ్జాండర్ స్టబ్ మాట్లాడుతూ.. ప్రపంచ వ్యవస్థ మార్పు దశలో ఉందని, గ్లోబల్ సౌత్ దేశాలు భవిష్యత్ దిశను నిర్ణయిస్తాయని తెలిపారు. భారత్‌కు ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కల్పించాలంటూ బహిరంగ మద్దతు ప్రకటించారు. ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలో భారత్‌కు స్థానం అత్యంత అవసరమన్నారు. శాశ్వత శాంతి ఐక్యరాజ్యసమితి సూత్రాలకు అనుగుణంగా ఉండాలని పేర్కొన్నారు.

# జనాభాతోనే భాగ్యం

మొదటి పేజీ తరువాయి

పేర్కొన్నారు. సిజేరియన్లు తగ్గిస్తామని, 8.8 శాతం ఉన్న టీనేజ్ గర్భధారణలు మూడుశాతం కంటే తక్కువకు తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. 50 మంది మహిళలు, చిన్నారులు ఒక ప్రాంతంలో ఉంటే కేర్ సెంటర్, పింక్ టాయిలెట్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. విశాఖపట్నంలో రూ.172 కోట్లతో వర్కింగ్ ఉమెన్ హాస్టల్ నిర్మాణం చేపట్టామని పేర్కొన్నారమూడో సంతానానికి ప్రోత్సాహకాలమూడో సంతానం ఆపై జననాలకు 12 నెలల పేరెంటల్ లీవ్, తండ్రులకు రెండు నెలల పెటర్నల్ లీవు ఇవ్వాలని ప్రతిపాదించినట్లు తెలిపారు. మూడో సంతానానికి పోషణ శిక్షా సురక్ష ప్యాకేజీ ఇస్తామని చెప్పారు. మూడో సంతానికి డెలివరీ సమయంలో రూ.25 వేలు ప్రోత్సాహంతోపాటు ఐదు సంవత్సరాల పాటు పోషణ కింద నెలకు రూ.1000 ఇస్తామని, 18 ఏళ్ల వరకూ ఉచిత విద్య అందిస్తామని పేర్కొన్నారు. తల్లిదండ్రుల సమాన బాధ్యత పేరుతో కుటుంబ బాధ్యతలు పంచుకోవడంపై అవగాహన క్యాంపెయిన్ చేపడతామని, చైల్డ్ కేర్ టేకర్లకు ప్రత్యేక శిక్షణ ఇస్తామని అన్నారు. 2047 నాటికి వృద్ధుల జనాభా 23 శాతం ఉంటుందని, వారి సంరక్షణకు ప్రతి జిల్లాలో ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేస్తామని అన్నారు. 175 కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాల్లో రెండు వారాలకు ఒకసారి క్లినిక్ నిర్వహిస్తామని అన్నారు.సిల్వర్ స్కిల్స్ రిజిస్ట్రీ ద్వారా 50 వేలమంది రిటైర్డ్ ప్రొఫెషనల్స్‌ను మెంటరింగ్‌లో భాగం చేస్తామని తెలిపారు. రిటైర్‌మెంట్‌కు ముందే 15 రోజులు వెల్‌నెస్ లీవ్ , రూ.50 వేల ఆరోగ్య నిధి అందిస్తామని అన్నారు. వైద్యసేవలు అందించేందుకు డిజిటల్ సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. ఈ ఏడాది జులై నాటికి 5.2 కోట్ల ప్రజలను 2086 ఆరోగ్య కేంద్రాల ద్వారా డిజిటల్ సంజీవని ప్రాజెక్టుతో అనుసంధానిస్తామని తెలిపారు. దూరదృష్టితోనే ఈ పాపులేషన్ మేనేజ్‌మెంట్ కార్యక్రమం చేస్తున్నామని తెలిపారు.

# బీహార్ రాజకీయాల్లో సంచలనం..

పాట్నా : బీహార్‌లో సుదీర్ఘకాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన జెడియు అధ్యక్షులు నితీశ్‌కుమార్ రాజ్యసభకు వెళ్లనున్నారు. ఈ మేరకు ఆయన గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా తదితరులు పాల్గొన్నారు. ఎన్‌డిఎ అభ్యర్థులు ఉపేంద్ర కుశ్వాహా, బిజెపి అధ్యక్షులు నితిన్ నబీన్ కూడా నామినేషన్లు దాఖలు చేశారు. రాజ్యసభ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయడంతో త్వరలోనే నితీశ్ కుమార్ సిఎం పదవికి రాజీనామా చేయనున్నారు. నామినేషన్‌కు ముందు సామాజిక మాధ్యమాల్లో తన నిర్ణయాన్ని నితీశ్ ప్రకటించారు. త్వరలో బీహార్‌లో ఏర్పడబోయే నూతన ప్రభుత్వానికి తన సహకారం ఉంటుందని పేర్కొన్నారు. శాసనసభ, శాసనమండలితోపాటు పార్లమెంటు ఉభయ సభల్లోనూ సభ్యునిగా సేవలందించాలనేది తన ఆకాంక్ష అని చెప్పుకొచ్చారు. రెండు దశాబ్దాలుగా తనను నమ్మి మద్దతు తెలిపిన వారికి ఆయన కృతజ్ఞతలు చెప్పారు. వారి మద్దతు వల్లే త్వరలో జరగనున్న రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. భవిష్యత్తులోనూ బీహార్ అభివృద్ధికి కృషి చేస్తానని నితీశ్ తెలిపారు.

బిజెపితో పొత్తు పెట్టుకుంటే ..నాశనమే ! : తేజస్వీయాదవ్నితీశ్ కుమార్ రాజ్యసభకు వెళ్లాలని నిర్ణయం తీసుకోవడం ంజకీయశ్రేణుల్లో తీవ్ర చర్చనీయాంశ మైంది. మిత్రపక్షాలను, ప్రాంతీయ పార్టీలను తన పంచన చేర్చుకొని బిజెపి మింగేస్తూవస్తోందని, నితీశ్‌ను రాజ్యసభకు పంపడం కూడా ఈ దుర్మార్గపు ఎత్తుగడలో భాగంగానే చూడాలని విమర్శలు వినిపిస్తున్నాయి. బిజెపి నితీశ్‌ను రాజకీయంగా హైజాక్ చేసిందని ఆర్‌జెడి నేత తేజస్వీయాదవ్ విమర్శించారు. నితీశ్‌ను ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించడానికి బిజెపి వ్యూహాలు పన్నుతోందని గతంలోనే చెప్పానన్నారు. 'మేం ముందునుంచే చెప్పాం. నితీశ్ ఆరు నెలలకంటే ఎక్కువ కాలం ఆ పదవిలో ఉండరన్నాం. అంతేకాదు, బిజెపి ఎవరితో పొత్తు పెట్టుకున్నా.. వారిని నాశనం చేసిన చరిత్ర ఉంది. ఒబిసిలు, దళితులు, గిరిజనులకు అనుకూలంగా నిలిచే నాయకత్వాన్ని బిజెపి కోరుకోవడం లేదు. ఏదేమైనా మేం చెప్పిందే ఇప్పుడు నిజమవుతోంది. నితీశ్‌ను కేంద్ర రాజకీయాలకు పంపడం బీహార్ ప్రజల ఆశయాలకు విరుద్ధం' అని తేజస్వీ తెలిపారు. బీహార్ ఎన్నికల ప్రచారంలో తాము చెప్పింది నిజమవుతోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

# దంతెవాడ-బీజాపూర్ సరిహద్దులో ఎన్‌కౌంటర్

మొదటి పేజీ తరువాయి

లక్షల రూపాయల ప్రభుత్వ రివార్డు ఉందని అధికారులు తెలిపారగీడం పోలీస్ స్టేషన్ పరిధిలోని గుమ్లానార్, గిర్సాపర, నెల్గోడ గ్రామాల మధ్య ఉన్న కొండ ప్రాంతంలో ఆయుధాలు, 'నక్సలైట్' సామాగ్రి దాచిపెట్టినట్లు పోలీసులకు విశ్వసనీయ నిఘా సమాచారం అందిన తర్వాత మార్చి 3న ఈ ఆపరేషన్ ప్రారంభ మైంది. డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్, బస్తర్ ఫైటర్స్ సభ్యులతో కూడిన సంయుక్త బృందం మధ్యాహ్నం 12:30 గంటల ప్రాంతంలో బయలుదేరింది. చుట్టుపక్కల అడవిలో ముమ్మర తనిఖీలు చేస్తూ ముందుకు సాగు తున్న సమయంలో, భైరామ్‌గఢ్ ఏరియా కమిటీకి చెందిన 8 నుండి 10 మంది సాయుధ మావోయిస్టుల నుండి అకస్మాత్తుగా భారీ కాల్పులు జరిగాయి. భద్రతా సిబ్బంది మావోయిస్టులను లొంగిపోవాలని హెచ్చరికలు జారీ చేశారు. మావోయిస్టులు దూకుడు పెంచడంతో ఆత్మరక్షణ కోసం ఎదురుకాల్పులు జరిపినట్లు అధికారులు పేర్కొన్నారు.ఈ ప్రతిఘటన మావోయిస్టులకు భారీ షాక్ ఇచ్చింది. ఎన్‌కౌంటర్ జరిగిన స్థలంలో పరిశీలించిన అనంతరం ఒక మావోయిస్టు మృతదే హంతో పాటు ఆయుధాలు, సంబంధిత వస్తువులు లభించాయి. వాటిలో ఒక ఎస్ఎల్ఆర్ రైఫిల్, ఒక ఐఎన్ఎస్ఏఎస్ రైఫిల్, ఒక మ్యాగజైన్‌తో కూడిన పిస్టల్, ఒక వాకీ-టాకీ సెట్, ఒక ఎస్ఎల్ఆర్ మ్యాగజైన్, ఆరు లైవ్ ఎస్ఎల్ఆర్ రౌండ్లు, ఒక ఖాళీ ఎస్ఎల్ఆర్ కార్ట్రిడ్జ్ కేసు, మూడు ఐఎన్ఎస్ఏఎస్ మ్యాగజైన్‌లు, ఐదు లైవ్ ఐఎన్ఎస్ఏఎస్ రౌండ్లు, 18 ఐఎన్ఎస్ఏఎస్ మిస్‌ఫైర్ రౌండ్లు, మూడు ఖాళీ ఐఎన్ఎస్ఏఎస్ కార్ట్రిడ్జ్ కేసులు, ఐదు లైవ్ పిస్టల్ రౌండ్లు, ఒక ఖాళీ పిస్టల్ కార్ట్రిడ్జ కేసు, ఒక పౌచ్ ను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. దంతెవాడ జిల్లా పోలీసులు ప్రకటించిన నక్సల్ వ్యతిరేక ఆపరేషన్ విజయవంతంగా ముగిసిందని సూచిస్తూ, భద్రతా సిబ్బందిలో ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా మొత్తం దళం తిరిగి వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు.

# ఫైనల్‌కు టీమిండియా

మొదటి పేజీ తరువాయి

చేసినా.. టీమిండియాకు ఆషామాషీగా ఏం విజయం దక్కలేదు. ఇంగ్లండ్ ఓపెనర్ బేథెల్(105; 48బంతుల్లో 8ఫోర్లు, 7సిక్సర్లు) చివరి వరకు పోరాడుతూనే ఉన్నాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా.. బేథెల్ పోరాటం ఆగలేదు. ఇంగ్లండ్ విజయానికి చివరి ఓవర్లో 30పరుగులు కావల్సిన దశలో బేథెల్ రనౌటవ్వడం, ఆ తర్వాత బంతికి ఒక్క పరుగే రావడంతో టీమిండియాకు విజయం ఖాయమైంది. కాని చివరి 3బంతులను జోఫ్రా ఆర్చర్ సిక్సర్లు కొట్టినా.. అప్పటికే టీమిండియాకు గెలుపు లాంచనమే అయ్యింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ సంజు శాంసన్‌కు దక్కిందిటాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్ కెప్టెన్ బట్లర్ నిర్ణయం బెడిసి కొట్టింది. యువ ఓపెనర్ అభిషేక్ శర్మ(9) నిరాశపరిచినా.. వికెట్ కీపర్ బ్యాటర్ సంజు శాంసన్ మరోసారి అదరగొట్టాడు. నిర్ణయాత్మక సూపర్-8 మ్యాచ్‌లో విండీస్‌పై అద్భుత ఇన్నింగ్స్ ఆడి టీమిండియాను సెమీస్‌కు చేర్చడంలో కీలకపాత్ర పోషించిన సంజు.. ఇంగ్లండ్ బౌలర్లకూ చుక్కలు చూపించాడు. కేవలం 42బంతుల్లోనే 8ఫోర్లు, 7భారీ సిక్సర్లతో 89పరుగులు చేసి టీమిండియా భారీస్కోర్‌కు దోహదపడ్డాడు. ఆ తర్వాత ఇషాన్ కిషన్ (39: 18బంతుల్లో 4ఫోర్లు, 2సిక్సర్లు)తో కలిసి శాంసన్ స్కోరు బోర్డును ముందుకు తీసుకెళ్లాడు. వీరిద్దరూ రెండో వికెట్‌కు ఏకంగా 97 పరుగులు జోడించారు. శివమ్ దూబే 25 బంతుల్లో 4 సిక్సర్లతో 43 పరుగులు చేయగా.. కెప్టెన్ సూర్యకుమార్ యువ సంచలనం తిలక్ వర్మ విధ్వంసం సృష్టించారు. హార్దిక్ 12 బంతుల్లో 27 పరుగులు చేయగా, తిలక్ వర్మ కేవలం 7 బంతుల్లోనే 3 భారీ సిక్సర్లతో సహా 21 పరుగులతో రాణించాడు. జోఫ్రా ఆర్చర్‌కి తోడు విల్ జాక్స్, ఆదిల్ రషీద్ చెరో రెండు వికెట్లు తీశారు. దీంతో భారతజట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి ఏకంగా 253 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది.ఛేదనలో భాగంగా ఇంగ్లండ్‌కు శుభారంభం దక్కలేదు. సాల్ట్(5), కెప్టెన్ బ్రూక్(7), బాటన్(17) నిరాశపరిచినా.. బట్లర్(25)కి తోడు బేథెల్ (105) సెంచరీతో ఇంగ్లండ్‌ను గెలుపు తీరాలకు చేర్చాడు. చివరి 4ఓవర్లను టీమిండియా బౌలర్లు కట్టడిగా వేసినా.. కేవలం 7పరుగుల తేడాతో మాత్రమే ఇంగ్లండ్ ఓటమిపాలైంది. ఆదివారం జరిగే ఫైనల్లో భారతజట్టు న్యూజిలాండ్‌తో తల పడనుంది. టీమిండియా బౌలర్లు హార్దిక్ స్కోర్‌బోర్డు...ఇండియా ఇన్నింగ్స్: సంజు శాంసన్ (సి)సాల్ట్ (బి)విల్ జాక్స్ 89, అభిషేక్ శర్మ (సి)సాల్ట్ (బి)జాక్స్ (20ఓవర్లలో 7వికెట్ల నష్టానికి) 253పరుగులు.వికెట్ల పతనం: 1/20, 2/117, 3/160, 4/190, 5/212, 6/236, 7/25బౌలింగ్: ఆర్చర్ 4-0-61-1, విల్ జాక్స్ 4-0-40-2, ఓవర్టన్ 3-0-36-0, కర్రన్ 4-0-53-0, ఆదిల్ రషీద్ 4-0-41-2, డాసన్ 1-0-19-0ఇంగ్లండ్ ఇన్నింగ్స్: సాల్ట్ (సి)అక్షర్ (బి)హార్దిక్ 5, బట్లర్ (బి)వరుణ్ చక్రవర్తి 25, బ్రూక్ (సి)అక్షర్ (బి)బుమ్రా 7 బేథెల్ (రనౌట్) హార్దిక్/సంజు 105, బాటమ్ (బి)అక్షర్ 17, విల్ జాక్స్ (సి)దూబే (బి)ఆర్ష్‌దీప్ 35, సామ్ కర్రన్ (సి)తిలక్ వర్మ (బి)హార్దిక్ 18, ఓవర్టన్ (నాటౌట్) 2, ఆర్చర్ (నాటౌట్) 19, అదనం 13. (20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి) 246పరుగులు.వికెట్ల పతనం: 1/13, 2/38, 3/64, 4/95, 5/172, 6/222, 7/22బౌలింగ్: ఆర్ష్‌దీప్ 4-0-51-1, హార్దిక్ 4-0-38-2, బుమ్రా 4-0-33-1, వరుణ్ చక్రవర్తి 4-0-64-1, అక్షర్ పటేల్ 3-0-35-1, దూబే 1-0-22-0.

## ఘనంగా భీమిలి గ్రామ దేవత
# శ్రీ నూకాలమ్మ చాటింపు మహోత్సవం



**భీమునిపట్నం ప్రజాస్వామ్యం** భీమిలి గ్రామ దేవత శ్రీ శ్రీ శ్రీ నూకాలమ్మ చాటింపు మహోత్సవం బుధవారం అర్ధరాత్రి ఘనంగా నిర్వహించారు శ్రీ నూకాలమ్మ దేవరను ఆలయ వంశ పారంపర్య అర్చకులు చౌదరి సత్య రావు కుమారులు తంగేడు పూలతో అలంకరించిన అమ్మవారి ఘరగ ను నూకాలమ్మ గుడి నుండి భీమిలి పురవీధుల్లో ఊరేగింపు చేసి పాత బస్టాండ్ వద్ద ఉన్న చదునుపట్టు వద్ద భక్తుల దర్శనాల నిమిత్తం ఉంచారు ఈ ఉత్సవంలో పులి వేషాలు తీన్మార్ తప్పుడు గుళ్ళు కాళీమాత వేషాలు కోలాటం బల్ల వేషాలు డీజే సంబరాలతో ఊరేగింపు ఘనంగా నిర్వహించారు ఈ ఊరేగింపు కార్యక్రమం చూడడానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో స్టీరింగ్ కమిటీ సభ్యులు గంటా నూకరాజు మారోజు సత్య ప్రసాద్ శిల్ల కరుణాకర్ రెడ్డి గాడు యశ్వంత్ ఉసిరికుల బంగార్రాజు( తాతాజీ) ఉత్సవ కమిటీ సభ్యులు గొలగాని నరేంద్ర కుమార్ వాసుపల్లి కొండబాబు అల్లిపిల్లి నరసింహారావు గిడుతూరి శ్రీనివాసరావు పాసి వినోద్ కుమార్ మారోజు సంజీవ్ కుమార్ ఆడిదం అంజనీ కుమార్ కనకల అప్పలనాయుడు కె కామేష్ శిల్ల వంశి రెడ్డి కొక్కిర అప్పన్న కాసారపు నాగరాజు కాసారపు ఎల్లాజీ తదితరులు పాల్గొన్నారు

## చిట్టివలస జడ్పీ బాలికల పాఠశాలలో హెచ్ ఎం శివజ్యోతి కృషితో ఘనంగా సరస్వతి విగ్రహం ఆవిష్కరణ .



**తగరపువలస ప్రజాస్వామ్యం** స్థానిక చిట్టివలస జిల్లా పరిషత్ బాలికలు పాఠశాల లో గురువారం సరస్వతి విగ్రహం ఆవిష్కరణ ఘనంగా జరిగింది. హెచ్.ఎం శివజ్యోతి కృషితో పాఠశాలలో సరస్వతి విగ్రహం ఏర్పాటు చేశారు. ముందుగా ప్రముఖ న్యాయవాది ఏం.వి.పార్వతీశం కనకరత్నం దంపతులు సరస్వతి పూజ నిర్వహించి విగ్రహాన్ని ప్రతిష్టంప చేశారు అర్చకులు భోగాపురపు కార్తికేయ శర్మ సంప్రదాయ రీతిలో విద్యార్దులు చే సరస్వతి నామం చెప్పించి విద్యార్థులకు నామ జపం ఉపయోగం వివరించారు. కార్తికేయ శర్మ విద్యార్థులను సరస్వతి పూజలో భాగస్వాములు చేశారు. పూజ అనంతరం పెన్స్ పూజ చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. విగ్రహం హెచ్.ఎం ఏర్పాటు చేయిగా విగ్రహం ప్లాటుఫారం అలంకరణ టీచర్ కామేశ్వరి విరాళంతో అమే భర్త స్వర్గీహాయ గుప్తా పేరుపై ప్లాటుఫారం నిర్మించారు. పాఠశాలలో సరస్వతి విగ్రహం ఏర్పాటుతో మంచి వాతావరణం ఏర్పడిందని విద్యా కమిటీ చైర్మన్ చెల్లూరి పావని చెప్పారు. ఈ సందర్భంగా సహాయం అందించిన కామేశ్వరి టీచర్ని హెచ్.ఎం సిబ్బంది ఘనంగా సత్కరించారు. పది ఎగ్జామ్స్ లో టాపర్కి ఏం.వి. పార్వతీశం మూడువేల పరితోషం ప్రకటించారు. అమెరికాలో ఉద్యోగం చేస్తున్న కామేశ్వరి టీచర్ కుమార్తె కీర్తి రెండువేలు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హాస్టల్ వార్డెన్ షర్మిల ఉపాధ్యాయులు రామలక్ష్మి .శ్రీదేవి. వెంకట లక్ష్మి .ప్రభావతి. ఉదయ్ మాధవి. భీమ్ భాయ్. సావిత్రి జీ.వి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ స్వప్న హైందవికి మహిళా దినోత్సవ పురస్కారం





ప్రజాస్వామ్యం , విజయనగరం

మహిళా సాధికారితకు సమానత్వమే పునాది అని ప్రముఖ సాహితీవేత్త, శ్రీ వాగ్దేవీ సమారాధనమ్ వ్యవస్థాపకురాలు డాక్టర్ పెన్నేటి స్వప్న హైందవి పేర్కొన్నారు. ఆంధ్ర ప్రదేశ్ గ్రంథాలయ సంఘం విజయనగరం జిల్లా శాఖ అధ్యక్షులు సముద్రాల గురుప్రసాద్ ఆధ్వర్యంలో ది సన్ స్కూల్ లో నిర్వహించిన అంతర్జాతీయ మహిళాదినోత్సవ వేడుకల్లో ఆమె పాల్గొని మాట్లాడుతూ అవసరానికి ఆసరాగా నిలిచే ధీరత్వం, ఎంతటి క్లిష్ట పరిణామాలనైనా ఎదుర్కొనే నేర్పరితనం, భూమాతకే అబ్బురం అనిపించేంత సహనం మహిళల స్వంతం అని అన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన గురుప్రసాద్ మాట్లాడుతూ స్త్రీ మూర్తి పురుషుడి వెనుక ఉంటే బలం, ముందు ఉంటే కవచం. పక్కనే ఉంటే జీవితాన్ని వసంతంగా మార్చేసే అద్భుతమని అన్నారు.ఆమె మౌనంతో మాట్లాడగలదు. నిశ్శబ్దానికి టీకా రాయగలదు. అక్షరాలకు అతీతమైన భాషలో మహిళ మహాపండితురాలని పేర్కొన్నారు. జననియే జగతికి ఆధారం పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో ముందుగా తుని ఛాంబర్ ఆఫ్ కామర్స్ పూర్వ అధ్యక్షులు పెనుగొండ కామరాజు, సన్ స్కూల్ కరస్పాండెంట్ మామిడిపాక అనిల్ కుమార్, పిన్నింటి కళావతిలతో కలసి జ్యోతి ప్రజ్వలనం చేసారు. ఈ సందర్భంగా లయ లాస్య డాన్స్ అకాడమీ విద్యార్థులు, అతిభినయ కళాక్షేత్రం విద్యార్థులు తమ నృత్య ప్రదర్శనలతో అలరించారు. ప్రముఖ గాయనీమణులు శైలజా కుమారి, ఎం హాసిని తమ గాత్రంతో ఆకట్టుకున్నారు. 2026 సంవత్సరానికి అంతర్జాతీయ మహిళా దినోత్సవ పురస్కారాన్ని డాక్టర్ స్వప్న హైందవికి ఎపి గ్రంథాలయ సంఘం జిల్లా శాఖ అధ్యక్షులు సముద్రాల గురుప్రసాద్ , పెనుగొండ కామరాజుతో కలిసి ప్రదానం చేసారు. ఈ సందర్భంగా బాలరామాలయ నిర్మాత కుసుమంచి సుబ్బారావుకు ఘనంగా సత్కరించారు. ప్రపంచ ఆర్యవైశ్య మహా సభ ఉత్తరాంధ్ర మహిళా విభాగం అధ్యక్షురాలు పలుకూరి ప్రభావతి, సంఘం కార్యదర్శి సుభద్రాదేవి, తాడేపల్లి నాగేశ్వరరావు, డి వి సత్యనారాయణ, డిమ్స్ రాజులు ఉత్తమ విద్యార్థులకు పతకాలను, ప్రశంసా పత్రాలను ప్రదానం చేసారు. ఈ సమావేశంలో సన్ స్కూల్ డీన్ రంగా, అకడమిక్ కో ఆర్డినేటర్ వసుధ, శ్వేత, ఛైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్ పర్సన్ గోటేటి హిమబిందు, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

# సుదర్శన నారసింహస్వామి వారికి క్షీరాధివాసం

ప్రజాస్వామ్యం,విజయనగరం

ప్రముఖ భారతీయ తత్వ దర్శన కేంద్రం శ్రీ క్షేత్రం లో కొలువై ఉన్న అష్టలక్ష్మి సమేత ఐశ్వర్య వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీశ్రీశ్రీ సుదర్శన నారసింహస్వామి వారి ఆలయ ప్రతిష్ట మహోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నారు. గురువారం ప్రత్యక్ష వాస్తు రచన, అర్చనాది హోమం, ఛాయాధివాసం మరియు క్షీరాధి వాసము, యాగశాలార్చన, నిత్య విశేష హోమములు, మూర్తి, కళా, మరియు గళంత్రికా కుంభ మంటపావాహనలు, ధాన్యాధి వాసము, వేద పారాయణ, యాగశాలార్చన, ప్రతిష్టా మూర్తులకు పంచామృతాభిషేకం, శుద్ధి, నిత్య విశేష హోమములు, చక్రాబ్జ మండలార్చన, వ్యాసపూర్వక హోమములు, మంగళాశాసనము గావించారు. .వేదమంత్రాలు నడుమ జరిగిన ఈ ఉత్సవంలో



దేవాలయం ధర్మకర్తలు దుర్గా బాలాజీ, ఉమాదేవి దంపతులు దుర్గా అశ్విన్, స్వప్న, రమ్య, నీరజ మన్నే తదితరులు పాల్గొన్నారు

# రేకుల షెడ్ లో సర్కారు వారి బడులు






ప్రజాస్వామ్యం /పాచిపెంట/ మన్యం జిల్లా.. మార్చ్5:

పాచిపెంట మండలంలో బోర్రమామిడి పంచాయతీ పరిధిలో ఉన్న బొడ్డపాడు గిరిజన గ్రామం లో స్కూల్ బిల్డింగ్ నిర్మాణం వెంటనే చేపట్టాలని రేకుల షెడ్డు ముందు పిల్లలు, పిల్లల తల్లిదండ్రులు నిరసన వ్యక్తం చేశారు. ఆదివాసి గిరిజనులైన సొయారి లక్ష్మణరావు, పోయి శ్రీరామ్ మాట్లాడుతూ. వర్షాకాలంలో పిల్లలు చదువుకోవడం చాలా కష్టంగా ఉందని గట్టిగా గాలి వేస్తే రేకులు ఎగిరిపోయి పిల్లలకు దెబ్బలు తగిలే అవకాశం ఉందని భయాన్ని వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితుల్లో స్కూలు పిల్లలకు ఎటువంటి ప్రమాదం కలగకుండా చూడవలసిన బాధ్యత అధికారులపై ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు అనేకసార్లు వినతి పత్రాలు ఇచ్చిన పట్టించుకోలేదని అన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సీఐటీయూ నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ గిరిజనులు పట్ల రాష్ట్ర ప్రభుత్వం చిన్న చూపు మానుకొని విద్యారంగం అభివృద్ధి కోసం కృషి చేయాలని కోరారు. గిరి శిఖర గ్రామ ప్రాంతాల్లో ఉన్నటువంటి గిరిజనులుఎటువంటి అవగాహన లేక, గిరిజనులు మూఢనమ్మకాలు, చేతబడి వంటి నమ్మకాలతో బ్రతుకుతున్నరు. గిరిజనులను చైతన్యవంతులుగా చేయాలంటే విద్య అనే ఆయుధం అవసరం. వారిలో చైతన్యం పెరగాలి అంటే బడులు తప్ప, చదువు తప్ప మరొక మార్గం లేదు. ప్రభుత్వాలు ఈ యొక్క సమస్యను గుర్తించి అధికారులు వెంటనే స్పందించవలసిందిగా కోరుతున్నాము. అన్ని గిరిజన ప్రాంతాల్లో కూడా స్కూల్ బిల్డింగులు నిర్మాణం మధ్యలో ఉన్నవి చేయాలని అన్నారు. ఒక్క బొడ్డపాడు గ్రామం అనే కాదు, పాచిపెంట మండలంలో అల్లంపాడు, కేరింగి పంచాయతీలో కొన్ని గ్రామాలు అలా చూసుకుంటే దాదాపు 8 ఏజెన్సీ గిరిజన ప్రాంతాల్లో స్కూలు బిల్డింగులు లేక ఇబ్బంది పడుతున్నారు. ఎగువగొట్టూరు గ్రామంలో 60 మందికి పైగా ఉన్న స్కూలు పిల్లలు ఉంటే స్కూల్ బిల్డింగు ప్రహరీ గోడలతో పాటు కట్టారని కానీ స్లాప్ వేయకపోవడం వలన రేకులతోనే కాలయాపన చేస్తున్నారని ఈ విషయాన్ని ఎన్నోసార్లు అధికారులకు దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేకున్నా పోతుందని గిరిజనులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా గిరిజనుల పట్ల ,విద్య పట్ల నిర్లక్ష్య వైఖరిని మానుకోవాలని సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు పత్రికా ముఖంగా కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు వెంటనే స్పందించి ఈ యొక్క సమస్యలకు పరిష్కారాన్ని చూపించాలని గిరిజన నాయకులు సోయారి లక్ష్మణరావు, పోయి శ్రీరామ్ అన్నారు.

# రీసర్వే, పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ మరింత వేగవంతం కావాలి

## జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి

ప్రజాస్వామ్యం/పార్వతీపురం, మార్చి 5 : జిల్లాలో జరుగుతున్న రీసర్వే, పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ మరింత వేగవంతం కావాలని జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి జేసీ, సబ్ కలెక్టర్లను కోరారు. నిషేధిత భూముల జాబితా నుంచి అర్హులైన వారి భూములకు హక్కులు కల్పించే ప్రక్రియను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. ఈ మేరకు జెసీ, సబ్ కలెక్టర్లతో జిల్లా కలెక్టర్ తన ఛాంబరులో గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ భూ వివరాలు, నిషేధిత జాబితాలో ఉన్న భూవివరాలపై నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో లక్ష్యాలను నిర్దేశించుకుని ఆ దిశగా పనిచేయాలని సూచించారు. పీజీఆర్ఎస్ లో నమోదైన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, తప్పనిసరిగా ఎండార్స్ మెంట్ వేస్తూ పరిష్కరించాలని కోరారు. ఆదివారంలోగా జిల్లాలో మిగిలి ఉన్న ఈకెవైసీ పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రెవిన్యూ క్లినిక్ ల ద్వారా రెవిన్యూ సమస్యలకు పూర్తిస్థాయిలో చెక్ పెట్టాలని,



వీలైనంత త్వరగా రీసర్వే పూర్తిచేయాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి, ప్రత్యేక ఉప కలెక్టర్ ఎస్.దిలీప్ చక్రవర్తి, రెవిన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

**హాస్టలనేది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే వేదిక**

**విద్యార్థులతో వార్డెన్లు కుటుంబ సభ్యుల్లా మెలగాలి**

**పిల్లలు స్వీయ రక్షణ చేసుకునేలా శిక్షణ ఇవ్వాలి**

**జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి**



ప్రజాస్వామ్యం/పార్వతీపురం, మార్చి 5 :

విద్యార్థులు పదవ తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యం కావాలని జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి వసతి సంక్షేమ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సాంఘిక, బిసి, గిరిజన సంక్షేమ శాఖల అధికారులు, పోస్ట్ మెట్రిక్ వసతి గృహాల వార్డెన్లతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంక్షేమ వసతి గృహాల్లో ఉండి చదువుకునే విద్యార్థులు పదవ తరగతి పరీక్షల్లో పూర్తి స్థాయిలో ఉత్తీర్ణత సాధించేలా అధికారులు కృషి చేయాలన్నారు. అందుకు సంబంధించి ఎఎస్.డబ్ల్యూఓ,ఎటిడబ్ల్యూఓ,ఎబిసిడబ్ల్యూఓలు వాట్సాప్ గ్రూపుని క్రియేట్ చేసి, ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకోవాలని సూచించారు. సొసైటీ కన్వీనర్ తప్పకుండా సమావేశానికి హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులకు ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించి, వారి విద్యాప్రమాణాలు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ముస్తాబు కార్యక్రమానికి సంబంధించి ప్రతీ స్కూల్, వసతి గృహాల్లో రోజు వారీ పురోగతిని వీడియోలు, రీల్స్ తీయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ప్రతీ వసతి గృహంలోనూ క్రమం తప్పకుండా యోగ, స్కిప్పింగ్, చదరంగం, ఆటలు, పాటల కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. వసతి గృహాల పర్యవేక్షకులు అధికారుల్లా కాకుండా పిల్లలతో కుటుంబ సభ్యుల్లా మెలిగి పిల్లల్లో ఉండే భయాన్ని పోగొట్టాలని కలెక్టర్ హితవు పలికారు. పిల్లలతో పాటు వార్డెన్లు కూడా ఆట పాటల్లో పాల్గొని వారిని ఉత్తేజ పరచాలని సూచించారు. చిన మేరంగి వసతి గృహ మరమ్మతులకు ప్రతిపాదనలు సమర్పించాలని బిసి సంక్షేమ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. హాస్టళ్లలో విద్యార్థులకు అందిస్తున్న వసతి, భోజనంతో పాటు పరిశుభ్రత, ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ద తీసుకోవాలన్నారు. విద్యార్థులు హాస్టళ్లలో సౌకర్యవంతంగా ఉండేలా అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. హాస్టళ్లలో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఆహారం నాణ్యతను రోజువారీగా పరీక్షించాలని, నీటి వనరులు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. విద్యార్థుల ఆరోగ్య పరీక్షలను క్రమం తప్పకుండా తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. విద్యార్థులు చదువులో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఉత్తేజభరిత కార్యక్రమాలు, ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. హాస్టల్ అనేది కేవలం వసతి గృహం మాత్రమే కాదని, విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దే వేదికని కలెక్టర్ అన్నారు. ప్రతీ విద్యార్థిని ఒక సైనికుడిలా తయారు చేయాలని, ఆపద వస్తే తమను తాము స్వీయ రక్షణ చేసుకునేలా శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ వార్డున్లకు సూచించారు. అన్ని హాస్టళ్లలో ఆర్ఓ ప్లాంట్లతో పాటు దోమల నివారణ చర్యలు తీసుకోవడం జరిగిందని, జిల్లాలోని 11 హాస్టళ్లకు సాధారణ మరమ్మతుల కోసం బీసీ సంక్షేమ శాఖ నుండి రూ. 20.80 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. వసతి గృహాల్లోని ఖాళీ ప్రదేశాల్లో మొక్కలను పెంచాలని సూచించారు. విద్యార్థులు తరవుగా చదవడం వల్ల విద్యార్థుల్లో జ్ఞాపక శక్తి పెంపొందుతుందని, పోటీ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించడానికి దోహదపడుతుందని కలెక్టర్ తెలిపారు. వసతి గృహం ప్రవేశ మార్గం నుండి విద్యార్థుల గదులు, వంటశాల, భోజనశాల, సిబ్బంది, వంట చేసే విధానం, భోదనా సిబ్బంది, అల్పాహారంకు సంబంధించిన వీడియోలను చిత్రీకరించి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా కలెక్టరు హయాంలో సంక్షేమ వసతి గృహాల్లో తీసుకువచ్చిన సంస్కరణలు, మార్పులను గుర్తుచేసుకుంటూ వసతి సంక్షేమ అధికారులు, వార్డెన్లు దుస్సాలువతో జిల్లా కలెక్టరును ఘనంగా సన్మానించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖాధికారి ఇ.అప్పన్న, జిల్లా గిరిజన సంక్షేమ సాధికారిత అధికారి ఎ.విజయశాంతి, సాంఘిక సంక్షేమ శాఖ సూపరింటెండెంటు జ్యోతి, వసతి గృహాల వార్డెన్లు సాంబయ్య, అనురాధ, నాగేశ్వరరావు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఏఎంసీలు రైతులకు అండగా నిలవాలి

## జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి స్పష్టీకరణ

ప్రజాస్వామ్యం/పార్వతీపురం, మార్చి 05 : రైతులు దళారీల చేతిలో మోసపోకుండా ఉండేందుకు వ్యవసాయ మార్కెటింగ్ కమిటీలు అండగా నిలవాలని జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి అధికారులను ఆదేశించారు.గురువారం జిల్లా కలెక్టర్ తన ఛాంబర్లో ఏఎంసీ చైర్మన్లు, కార్యదర్శులు మరియు మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కీలక సూచనలు చేశారు. రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోకుండా, నేరుగా ఏఎంసీలకు వచ్చి తమ పంటను విక్రయించుకోవాలని, తద్వారా వారికి గరిష్ట లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. జిల్లాలో ప్రస్తుతం ఉన్న నాలుగు ఏఎంసీల్లో రైతులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు ఉండేలా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పంట విక్రయాల సమయంలో తూకంలో ఎలాంటి అవకతవకలు జరగకూడదని, రైతులు నష్టపోకుండా కచ్చితత్వంతో కూడిన తూకం ఉండేలా పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.మార్కెటింగ్ యార్డులకు వచ్చే రైతులకు ఎటువంటి




ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత కార్యదర్శులు మరియు చైర్మన్లదేనని ఆయన గుర్తుచేశారు. ఈ సమావేశంలో పార్వతీపురం, పాలకొండ, సాలూరు, కురుపాం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు గొట్టాపు గౌరి, బి.సంధ్యారాణి, ముఖి సూర్యనారాయణ, కె.కళావతి, జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు బి. శ్రీనివాస రావు, కార్యదర్శులు, వివిధ ఏఎంసీల ప్రతినిధులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అవంతిలో "అవెన్సిస్ 2కె26" యూత్ ఫెస్ట్ పోస్టర్ ఆవిష్కరణ



తగరపువలస, ప్రజాస్వామ్యం అవంతి కళాశాలలో "అవెన్సిస్ 2కె26" యూత్ ఫెస్ట్ కార్యక్రమాన్ని రెండు రోజులు పాటు మార్చి 13 మరియు 14 వ తేదీలలో నిర్వహిస్తున్నామని అవంతి విద్యా సంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు చెప్పారు. ఈ సందర్భంగా పోస్టర్ ను విడుదల చేశారు. ఈ యువజనోత్సవాలలో భాగంగా విద్యార్థులకు వివిధ క్రీడాంశాలు అయినటువంటి బాస్కెట్ బాల్, కబడ్డీ, వాలీబాల్, కోకో, క్రికెట్, త్రోబాల్, చెస్, టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్, క్యారమ్స్, యోగా, కరాటే, స్లో బైక్ రేస్, ట్రెజరీ హంట్, పాటలు పోటీలు, సోలో నృత్యం, గ్రూప్ డాన్సులు, స్కిట్స్, స్టాండ్ అప్ కామెడీ, స్పాట్ ఫోటోగ్రఫీ, షార్ట్ ఫిల్మ్ మేకింగ్, ఎడ్వర్టైజ్మెంట్ కాంపిటేషన్, ఆటో ఎక్స్పో, ఈ స్పోర్ట్స్, ఫ్యాషన్ షో, గ్రాఫిటీ కాంపిటేషన్ మూవీ క్విజ్, రాక్ బ్యాండ్, బాడీ బిల్డింగ్ షో, మెమేస్ క్రియేషన్, డిజైన్స్, రాంప్ వాక్ మొదలగు సాంస్కృతిక కార్యక్రమాలలో పోటీలు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ డా. బి.మురళీకృష్ణ, డైరెక్టర్స్ డా. ఎ. చంద్రశేఖర్, ఎస్. విశ్వ ప్రసాద్ తెలిపారు.

# మహిళా క్రీడాకారులకు కబడ్డీ కిట్లు పంపిణీ



భీమునిపట్నం, ప్రజాస్వామ్యం దివిస్ లేబరేటరీస్ లిమిటెడ్ చిప్పాడ వారు గురువారం దివిస్ నారి ప్రో కబడ్డీ లీగ్ లో పాల్గొంటున్న సుమారు ఏడు పంచాయతీల్లో నుంచి 8 కబడ్డీ మహిళా జట్టులకు చెందిన 96 మంది మహిళ క్రీడాకారులకు కబడ్డీ కిట్లు పంపిణీ చేసారు. ఈ కిట్లు లో ప్లే సూటు, ట్రాక్ సూటు, మ్యాట్ షూస్, నీ గార్డ్ అందించడం జరిగింది. శుక్రవారం, శనివారం రెండు రోజులు పాటు ఈ కబడ్డీ పోటీలు నిర్వహించబడతాయని సి ఎస్ ఆర్ మేనేజర్ డి.సురేష్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వి. శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ పి.అప్పారావు రిఫరీ బోర్డు కన్వీనర్, ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్, సి ఎస్ ఆర్ ప్రతినిదులు ఏ. శ్రీనివాస్, కే.నరసింహ, పి. శేఖర్ బాబు ఆర్గనైజర్స్ మహేష్, లక్ష్మి, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# విజయవంతమైన ఉచిత నేత్ర వైద్య శిబిరం

**---- ఫౌండేషన్ అధ్యక్ష ,కార్యదర్శులు సాయికుమార్, రేవంత్**

ప్రజాస్వామ్యం /గజపతినగరం:

సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ , నేత్రాలయ ఐ కేర్ లు సంయుక్తంగా గురువారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరం విజయవంతమైందని నిర్వాహకులు విలేకరులకు తెలియజేశారు. స్థానిక నేత్రాలయ ఐ కేర్ వద్ద శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వారి సహకారంతో జిల్లా అంధత్వ నివారణ సంస్థ వారి సౌజన్యంతో జరిగిన ఈ శిబిరంలో ఆప్తోమెట్రిసియన్ దీపక్ తనిఖీలు నిర్వహించారు. 87 మంది కంటి రోగులకు పరీక్షలు జరపగా, 39 మందిని కేటరాక్ట్ సర్జరీ కి ఎంపిక చేశారు. వీరందరిని బస్ ద్వారా తీసుకుని వెళ్లి కళ్ళకు శాస్త్ర చికిత్సలు చేయించడం జరుగుతుందని ఫౌండేషన్ అధ్యక్ష కార్యదర్శులు సాయి కుమార్ , రేవంత్ అన్నారు. గజపతినగరం కమ్యూనిటీ ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ శ్రీనివాసరావు పాల్గొని శిబిరం జరుగుతున్న తీరును పరిశీలించారు. అదే విధంగా శిబిరానికి వచ్చిన వారందరికీ సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ వారు భోజనాలు ఏర్పాటు




చేశారు. కార్యక్రమంలో ఐ కేర్ నిర్వాహకురాలు మౌనిక ,క్యాంప్ సమన్వయకర్త వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# ఘనముగా కాలంరాజుపేట ఎల్లమ్మ జాతర

**వైభవంగా సిరిమానోత్సవం**

ప్రజాస్వామ్యం / గజపతినగరం:

మండలంలోని కాలంరాజుపేట గ్రామంలో ఎల్లమ్మ జాతర ఘనంగా జరిగింది. బుధవారం తోలేలు ఉత్సవంతో ప్రారంభమైన జాతర గురువారం ప్రధాన ఘట్టమైన సిరీమాను సంబరంతో ముగిసింది. సిరీమాను దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం ఐదున్నర గంటల సమయంలో మూడు పర్యాయాలు సిరీమాను తిరగగా భక్తులు అమ్మవారి దర్శనం చేసుకున్నారు. నిర్వాహకులు గ్రామ సర్పంచ్ గేదెల ఈశ్వరరావు, ఎంపీటీసీ గేదెల జగదీష్, మాజీ ఎంపీటీసీ గేదెల ఈశ్వరరావు ఆధ్వర్యంలో జాతర వైభవంగా జరిగింది. గురువారం ఉదయం నుంచే ఎల్లమ్మ గుడి వద్ద అమ్మవారి దర్శనం కోసం భక్తులు





పోటెత్తారు. ప్రధానంగా మండలంలోని సీతారాంపురం, కాలం రాజుపేట, డోలపాలెం, పాత శ్రీరంగరాజపురం, కొత్త శ్రీ రంగరాజపురం, ఎం. వెంకటాపురం గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలోఈ జాతరకు హాజరయ్యారు.

# ప్రతిష్ఠాత్మకంగా జనగణన



**శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్**
**--- ఎస్. రాంసుందర్ రెడ్డి**

ప్రజాస్వామ్యం / విజయనగరం :

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న 16వ జనాభా గణన ప్రక్రియను జిల్లాలో విజయవంతంగా నిర్వహించేందుకు యంత్రాంగం సిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి కోరారు. చింతలవలసలోని ఎం.వి.జి.ఆర్. ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న మొదటి దశ 'గృహాల జాబితా మరియు గృహ వసతుల గణన' మూడవరోజు శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. శిక్షణ తీరును పరిశీలించారు. వివిధ అంశాలపై వారి అవగాహనా స్థాయిని పరీక్షించారు. సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మరియు ప్రిన్సిపల్ సెన్సస్ అధికారి రాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ జనగణన సమర్ధవంతంగా పూర్తి చేసేందుకు సిద్ధం కావాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ మూడు రోజుల శిక్షణను సద్వినియోగం చేసుకొని, జనగణన డేటా సేకరణపై అధికారులు పూర్తి అవగాహన పెంచుకోవడమే కాకుండా, సందేహాలను పూర్తిగా నివృత్తి చేసుకోవాలని సూచించారు. బ్లాక్ లను ఏర్పాటు చేయడం, మ్యాపుల్లో గ్రామ సరిహద్దులను నిర్ణయించడం, జనాభా అంచనా వేయడం తదితర అంశాలను కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో జనగణన జాయింట్ డైరెక్టర్, సి.పి.ఓ బాలాజి, వివిధ శాఖల అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, శిక్షకులు పాల్గొన్నారు.

# గజపతినగరం సర్కిల్లో "నాఖ బంది"

**సర్కిల్ ఇన్స్పెక్టర్ - జి.ఏ.వి రమణ సబ్ ఇన్స్పెక్టర్ - యు.మహేష్**

ప్రజాస్వామ్యం /బొండపల్లి(గజపతినగరం) :

జిల్లా ఎస్పీ ఏ.ఆర్.దామోదర్ ఆదేశాల మేరకు గజపతినగరం సర్కిల్ పరిది లో ఐదు ప్రాంతాలలో నాఖబంధీ ని నిర్వహించడం జరిగిందని సర్కిల్ ఇన్స్పెక్టర్ జిఏవి రమణ విలేకరులకు తెలియజేశారు. ఈ నాబంది లో వాహనదారులకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించడం జరిగిందని సి.జి.ఏ.వి రమణ అన్నారు. ఈ డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షల్లో 11 మందిపై కేసులు నమోదు చేయడం జరిగిందని ఆయన అన్నారు. సర్కిల్ పరిధిలో గల బొండపల్లి పోలీస్ స్టేషన్ జంక్షన్ వద్ద, గజపతినగరం పోలీస్ స్టేషన్ పురిటిపెంట జంక్షన్ వద్ద , మానాపురం పోలీస్ స్టేషన్ గర్భం జంక్షన్ వద్ద , బూర్జి వలస ,ఆంధ్ర పోలీస్ స్టేషన్ల పరిధిలో నాకా బంది నిర్వహించడం జరిగిందని సీఐ రమణ అన్నారు. ఈ సందర్భంగా సి.ఐ జి ఏ వి రమణ మాట్లాడుతూ ఎవరైనా మద్యం సేవించి వాహనం



నడిపితే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని , జరిమానాలే కాకుండా జైలు శిక్ష కూడా పడుతుందని సి.ఐ జి .ఏ.వి రమణ హెచ్చరించారు. ఈ నాకాబంది లో బొండపల్లి ఎస్.ఐ యు.మహేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పురిటిపెంట జంక్షన్ వద్ద నాకాబంది

**---- ముమ్మరంగా వాహన పత్రాల తనిఖీ**
**---- గంజాయి అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవు**

ప్రజాస్వామ్యం/ గజపతినగరం:

జిల్లా ఎస్పీ ఏ.ఆర్.దామోదర్ ఆదేశాల మేరకు గజపతినగరం సర్కిల్ ఇన్స్పెక్టర్ జి ఏ వి రమణ ఆధ్వర్యంలో గురువారం నాడు గజపతినగరం మండలం పురిటి పెంట గ్రామ జంక్షన్ దగ్గర నాకాబంది నిర్వహించడం జరిగిందని స్థానిక ఎస్సై కే కిరణ్ కుమార్ నాయుడు విలేకరులకు తెలియజేశారు. ఈ ఈ సందర్భంగా ఎస్ ఐ కే కిరణ్ కుమార్ నాయుడు మాట్లాడుతూ





గంజాయి అక్రమ రవాణా చేస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వాహనాలను సీజ్ చేస్తామని అన్నారు . అదేవిధంగా వాహనదారులు సరైన పత్రాలు లేకుండా వాహనాలను నడిపితే అటువంటి వాహనాలను సీజ్ చేయడం జరుగుతుంది అని ఎస్సై కిరణ్ కుమార్ నాయుడు హెచ్చరించారు. గజపతినగరం సర్కిల్ పరిధిలో గల ఐదు పోలీస్ స్టేషన్ లలో నాకాబంది నిర్వహించడం జరిగింది అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామంలోనే పరిష్కారం చూపేందుకే 'విలేజ్ రెవిన్యూ క్లినిక్

**జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి వెల్లడి**

ప్రజాస్వామ్యం/కొమరాడ/మన్యం జిల్లా.. మార్చి 5 :

ప్రజలు తమ రెవిన్యూ సమస్యల పరిష్కారం కోసం జిల్లా మరియు మండల కేంద్రాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా, వారి గ్రామంలోనే పరిష్కారం చూపేందుకే 'విలేజ్ రెవిన్యూ క్లినిక్' కార్యక్రమాన్ని చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి వెల్లడించారు. గురువారం కొమరాడ మండలం విక్రమపురం సచివాలయంలో నిర్వహించిన గ్రామ రెవిన్యూ క్లినిక్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్ ఆర్.వైశాలితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ అర్జీదారుల నుండి వినతులను స్వీకరించి, అక్కడికక్కడే అధికారులతో సమీక్షించారు. అర్జీదారుల సమస్యలపై తక్షణమే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...భూ సమస్యలు, సర్వే, పట్టాదారు పాస్ పుస్తకాలు వంటి రెవిన్యూ సంబంధిత సమస్యలను వేగంగా పరిష్కరించడమే ఈ క్లినిక్ ప్రధాన ఉద్దేశ్యమన్నారు. మారుమూల గ్రామాల ప్రజలు తమ




సమస్యల కోసం వ్యయప్రయాసలకోర్చి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండరాదని చెప్పారు. సచివాలయ స్థాయిలోనే ఉన్నతాధికారులు అందుబాటులో ఉండటం వల్ల పనుల్లో జాప్యం తగ్గుతుందని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి, స్థానిక రెవిన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# నియోజకవర్గాల లో గుర్తించిన అవసరాల పై సవివరంగా నివేదికలివ్వండి

**జిల్లా కలెక్టర్ ఎస్.రాం సుందర్ రెడ్డి**

ప్రజాస్వామ్యం /విజయనగరం:

నియోజక వర్గాలలో శాసన సభ్యులు గుర్తించి పరిష్కరించమని కోరిన పనులకు, ప్రాజెక్టులకు శాఖల వారీగా సవివరమైన నివేదికలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి తెలిపారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో సమీక్షించారు. నియోజక వర్గం వారీగా శాసన సభ్యులు పెట్టుకున్న వినతులలో ముఖ్యమైన వాటిని, ఆర్థికపరంగా మంజూరులు చేయవలసిన పనులకు, ప్రాజెక్టులకు ఎంతెంత ఖర్చు అవుతుంది, దానివలన ఎంతమందికి ప్రయోజనం చేకూరుతుంది వంటి అంచనాలతో కూడిన నోట్స్ ను వివరంగా ఆయా శాఖలు సమర్పించాలని కలెక్టర్ సూచించారు. ఇప్పటికే మంజూరైన పనులకు నిధులు రాకుండా ఉన్న వాటి వివరాలను కూడా పొందుపర్చలన్నారు. త్వరలో ముఖ్యమంత్రి తో జిల్లా



అబివృద్ధి పై. ప్రజాప్రతినిధులు, ఇంచార్జ్ మంత్రి, జిల్లా కలెక్టర్ తో సమావేశం ఉన్నందున ఈ వివరాలన్నింటి పై 1 పేజీ నోట్స్ ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జేసీ సేదు మాధవన్, సి.పి.ఓ బాలాజీ, ఆర్ అండ్ బి, ఆర్.డబ్ల్యు.ఎస్, పంచాయతీ రాజ్, ఇరిగేషన్, వైద్య ,విద్య ఉద్యాన, వ్యవసాయ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నాణ్యమైన సరుకులను తక్కువ ధరకు అందించడమే లక్ష్యం



ప్రజాస్వామ్యం/పార్వతీపురం, మార్చి 5 :

వినియోగదారులకు నాణ్యమైన సరుకులను తక్కువ ధరకు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ ఇంచార్జి ప్రాజెక్ట్ అధికారి సి.యశ్వంత్ కుమార్ రెడ్డి సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. పార్వతీపురం టౌన్ లోని గిరిజన సహకార సంస్థ సూపర్ బజార్‌ను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సూపర్ బజార్‌లోని వివిధ విభాగాలను పరిశీలించి, సరుకుల నిల్వలు మరియు నాణ్యతను పరిశీలించారు. నిత్యావసర వస్తువుల ధరలు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలని, ధరల పట్టికను వినియోగదారులకు కనిపించేలా ప్రదర్శించాలని అధికారులను ఆదేశించారు. గిరిజన ఉత్పత్తులైన తేనె, కాఫీ, చింతపండు వంటి వస్తువుల నాణ్యతలో ఎక్కడా రాజీ పడకూడదని స్పష్టం చేశారు. సూపర్ బజార్‌లో సరుకుల కొరత లేకుండా చూసుకోవాలని, నిల్వల రిజిస్టర్లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీసీసీ మేనేజర్లు, రెవెన్యూ అధికారులు మరియు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ - ఎస్. రామసుందర్ రెడ్డి



ప్రజాస్వామ్యం / విజయనగరం:

ఇంటర్ మీడియట్ పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక తోటపాలెంలోని శ్రీనివాస జూనియర్ కళాశాలను కలెక్టర్ సందర్శించారు. పరీక్షలు నిర్వహిస్తున్న తీరును పరిశీలించారు. పరీక్ష వివరాలు, విద్యార్థుల హాజరు తదితర అంశాలను అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. పకడ్బంధీగా పరీక్షలను నిర్వహించాలని ఆదేశించారు. కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ప్రాథమిక చికిత్సా కేంద్రాన్ని తనిఖీ చేశారు. అందుబాటులో ఉన్న మందులు గురించి కలెక్టర్ ఆరా తీశారు. సరిపడినన్ని ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

# జై జవాన్ ఫౌండేషన్ 4 వ వార్షికోత్సవ సందర్భంగాఅభాగ్యులకు భోజనం ఏర్పాటు

**ఆనందపురం ప్రజాస్వామ్యం** జై జవాన్ ఫౌండేషన్ 4వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ఆనందపురం కూడలిలో ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కుప్ప రాజశేఖర్ రామలక్ష్మి ఆధ్వర్యంలో ఫౌండేషన్ సభ్యులు అభాగ్యులు, నిరాశ్రయులు, నిరుపేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా జై జవాన్ ఫౌండేషన్ ట్రెజరీ కుప్ప రామలక్ష్మి మాట్లాడుతూ జై జవాన్ పౌండేషన్ స్థాపించి గడిచిన నాలుగు సంవత్సరాల్లో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. ఉచిత వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి ఆపదలో ఉన్న వాళ్ళకి రక్తం అందిస్తూ ఎంతో మంది కి తమ తోర్పాటును అందిస్తున్నామన్నారు రోడ్డు సైడ్ ఉన్నటు వంటి అభాగ్యులకు, అనాధాశ్రమలకు వృద్ధాశ్రమలకు అన్నదానం చేస్తున్నట్లు వివరించారు. క్యాన్సర్ పేషెంట్లకు, కిడ్నీ బాధితులకు పేద వాళ్లకి ధనసహాయం తమ ఫౌండేషన్ చేపడుతున్నామన్నారు.




ఈసందర్భంగా 400 మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో జై జవాన్ ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ ముడసల శ్రీను సెక్రెటరీ ముడసల కార్తీక్, ట్రెజరీ కుప్ప రామలక్ష్మి జనరల్ సెక్రెటరీ ఇమంది శ్రీనివాసరావు ఫౌండేషన్ మెంబెర్స్ రాము, రమణ అప్పలనాయుడు చంటి ,అప్పారావు గణేశ్ రాజుకుమార్ శ్రీను,రాజు, నర్సియమ్మ, తదితరులు పాల్గొన్నారు.

EDITED PRINTED, PUBLISHED AND OWNED BY M. SIVAKUMAR, PRAJA SWAMYAM TELUGU DAILY, PLOT NO 138 PAVANI NAGAR, CANTONMENT, VIZIANAGARAM-535003. (AP) PRINTED AT JAYAM GRAPHICS, OFF-SETPRINTERS, PLOT NO. 138, PAVANI NAGAR, CANTONMENT. VIZIANAGARAM 535003, (AP)
Cell 97032 07611, E-mail pldnewsvzm@gmail.com. RNI No. APTEL/2008/24928 Poster Regd. No. VZM/22/2020-2022